యోగవాశిష్ఠ హృదయము

ఈ గ్రంథం గురించి

పన్నెండేళ్ళ శ్రీరాముడిలో పెల్లుబికిన తత్త్వ విచికిత్సా కల్లోలానికి
వశిష్ఠమహర్షి చూపించిన పరిష్కారం
ఆత్మతత్త్వావగాహనకై కురిపించిన యుక్తుల వర్షం
గజిబిజి అల్లికలైన ఉపనిషత్తులను వింగడించి నిరూపించిన సారం
రామాయణ రచనానంతరం
వాల్మీకి మహర్షి మహాకవి చేతిలో
కవితా రసమయంగా రూపొందిన తాత్త్విక కావ్యం
అదే యీ యోగవాశిష్ఠం!
దీని సారాన్ని
అటు సనాతన సాంప్రదాయిక విద్యతోనూ
ఇటు అధునాతన విజ్ఞానశాస్త్రంతోనూ సమన్వయించి
కవి హృదయం శ్రోతలకు అందే లాగా
అవధూత దత్తపీఠ విద్యాధికారి

శ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తిగారు

(+91 40−24035013, E-mail: vedakavi@serveveda.org, web: www.serveveda.org)

జెమినీ **T.V** లో చేసిన ప్రవచనాలకి
అక్షరరూపమే
ఈ
యోగవాశిష్ఠ హృదయము
ఇది మొత్తం ఏడు ప్రకరణాల ఉద్గ్రంథం.

ఆధ్యాత్మిక విద్యాతపన గల ఈ వెబ్‌సైట్ పాఠకులందరికీ ఈ కవి హృదయకమలం పూజాకుసుమంగా సవినయ సమర్పితం.

రచయిత మనవి

కవి తన హృదయాన్ని ఎందుకు దాచుకుంటాడు?

దొరికినవారికి అది మరింత మహోజ్జ్వలంగా ప్రకాశించేందుకోసమే దాచుకుంటాడు!

అందుకనే కవి తన హృదయాన్ని ఇనప పెట్టెలో దాచడు, పదాల పూరేకుల్లో దాస్తాడు!

తన హృదయం పఠితలకు అందాలి. కానీ, కొంత కృషి చేసినవారికే అది అందాలి. ఇది మహాకవుల దృష్టి! వారి సృష్టిలోని అంతర్దృష్టి!!

యోగవాశిష్ఠం విషయంలో నా కృషి చాలా స్వల్పమే అయినా, శ్రీగణపతి సచ్చిదానంద గురుదేవుల కృపాబలం, వాల్మీకి మహాకవి హృదయాన్ని నాకు అనాయాసంగా తెరిచి చూపించిన అనుభూతి అడుగడుగునా వుంది. ఇది నా అదృష్టం. దీన్ని నా సోదరులందరితోనూ కలసి పంచుకోవాలనే ఆశయంతోనే జెమినీ T.V లో యోగవాశిష్ఠ ప్రవచనాలు జరిగాయి.

"మధుమయ ఫణితీనాం మార్గదర్శీ మహర్షిః" అన్నాడు కవికుల గురువైన కాళిదాసు, వాల్మీకి మహాకవిని గురించి ప్రస్తావిస్తూ. ఈ వాక్యం అసలు రామాయణ విషయంలో కంటే, వాశిష్ఠరామాయణ విషయంలో మరింతగా అక్షర సత్యం.

శ్రీరాముడు లాంటి మహానాయకుణ్ణి, రావణవధవంటి మహాకథనీ, ఎంచుకున్నప్పుడు, సామాన్య కవికైనా సరే, కవిత్వాన్ని పండించటం పెద్ద కష్టం కాకపోవచ్చు. కానీ, సాక్షాత్తుగా శుష్కవేదాంతాన్ని విషయంగా తీసుకొని, దాన్ని అతినిశితమైన శాస్త్రచర్చలతో నింపి, 32 వేల శ్లోకాలకు సాగదీసి, అయినా కూడా దానిలో కావ్యత్వాన్ని, కవితాత్మనూ, సజీవంగా నిలబెట్టగలగటం వాల్మీకి మహాకవికి ఒక్కడికే చెల్లింది. ఆయనతో పోటీపడి అలాంటి పని సాధించగల కవి మరొకడు ఇంతవరకూ పుట్టలేదు.

గురుదేవుల కృపతో ఈ గుర్తింపు కలగటంవల్ల, ఈ మహాగ్రంథంలో ఆ మహాకవి హృదయమేమిటని అన్వేషించాలని ఆరాట పడ్డాను. ఈ విషయంలో నన్ను నిజంగా "పదే పదే" ఆదుకొన్న మహానుభావుడు "పరమహంస శ్రీమదానంద బోధేంద్ర సరస్వతీ యతివరుడు". ఆయన రచించిన "తాత్పర్య ప్రకాశ వ్యాఖ్య" నాలాంటి మరిగుజ్జును సాలప్రాంశువుగా మార్చి, యోగవాశిష్ఠ రసాల ఫలాలను చేతికందించింది. ఆ బలంతోనే యోగవాశిష్ఠ హృదయాన్ని అందుకొనే ప్రయత్నం నేను చెయ్యగలిగాను.

ముందుగా ఈ యోగావాశిష్ఠమంటే యేమిటో పఠితలకు పరిచయం చెయ్యటం సముచితం. ఈ రోజుల్లో పరిచయాలన్నీ "ఫార్మాట్" రూపంలో వుండటం పరిపాటి కనుక, నేనూ అలాగే చేస్తాను.

యోగవాశిష్ఠ పరిచయము:

1. **రచయిత** – వాల్మీకి మహర్షి
2. **రచన కాలం** – రామాయణ రచన పూర్తి అయిన తరువాత కొద్ది కాలానికి
3. **గ్రంథానికి ఇతర పేర్లు** – జ్ఞానవాశిష్ఠము, వాశిష్ఠ రామాయణము, ఉత్తర రామాయణము, మహారామాయణము, వాశిష్ఠము, వాసిష్ఠము మొదలైనవి.
4. **గ్రంథ పరిమాణము** – 32 వేల శ్లోకాలు. (అసలు రామాయణం 24 వేల శ్లోకాలే)
5. **విషయం**–పరమాత్మ తత్త్వ విచారణ. 12 సంవత్సరాల శ్రీరాముడికి విశ్వామిత్ర మహర్షి, వశిష్ట మహర్షి, చేసిన తత్త్వ బోధలు. హృదయంలో తత్త్వ విజ్ఞానం కలవాడు మరింత వ్యవహార దక్షుడు అవుతాడని నిరూపణ.
6. **రచనా శైలి, ప్రత్యేకతలు** –

ఎ) చెప్పదలచుకొన్న సిద్ధాంతాన్ని ముందు సంగ్రహంగా చెబుతారు.

బి) అదే విషయాన్ని మళ్ళీ అందమైన కథ ద్వారా వివరిస్తారు.

సి) ఈ కథలోని సంకేతాలను మళ్లీ గ్రంథ కర్తే వివరిస్తారు.

డి) ఏ సిద్ధాంతాన్నీ ఖండించడం వుండదు.

ఇ) వాద ప్రతివాదాలు వుండవు.

ఎఫ్) అనేక రకాల సందేహాలను లేవదీసి సమాధానాలు చెబుతారు.

జి) విషయం శుష్కమైన వేదాంతం అయినప్పటికీ, రచనలో అడుగడుగునా కవితా సౌందర్యం ఉట్టిపడుతూనే వుంటుంది.

హెచ్) అడుగడుగునా ఊహకందని ఉపమానాలంకారాలు విందులు చేస్తూ ఉంటాయి.

7. **సంగ్రహాలు** – ఈ గ్రంథం చాలా విస్తారమైనది అవటంచేత ఉత్తర భారతంలోనూ, దక్షిణ భారతంలోనూకూడా, దీనికి కొన్ని సంగ్రహ ప్రతులు ఏర్పడ్డాయి. వీటిలో ప్రసిద్ధమైనవి–

ఎ) కాశ్మీర దేశీయుడు అభినందన పండితుడి సంగ్రహం.
ఇది ఆరు వేల శ్లోకాలు.

బి) కాళహస్తి శుక బ్రహ్మ ఆశ్రమ అధిపతి
శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారి సంగ్రహం. దీని పేరు వశిష్ఠ గీత.
సుమారు 8 వేల శ్లోకాలు

8. **అనువాదములు** – అన్ని జాతీయ భాషలలోనూ దీనికి అనువాదాలున్నాయి. తెలుగులో 5 వచనానువాదాలను, ఒక పద్యానువాదాన్ని, నేను చూశాను. వీటిలో బ్రహ్మశ్రీ మల్లావఝ్ఝల
సుబ్బరాయశర్మగారి అనువాదం ప్రామాణికమై వుండి నాకు ఎంతో ఉపకారం చేసింది. వీరందరికీ నా కృతజ్ఞతలు.

9. **పెద్దల అభిప్రాయాలు** – ప్రాచీనులు మాత్రమే గాక నవీన సద్గురువులు కూడా ఈ గ్రంథాన్ని విశేషంగా అభిమానించారు. ఉదాహరణకు

   ఎ) శ్రీ స్వామి రామతీర్థ ఇది ప్రంపంచంలోని ఆధ్యాత్మిక
   గ్రంథాలన్నిటిలోకీ "Most Wonderfull" అన్నారు.

   బి) ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతులు
   శ్రీమళయాల స్వామివారు ఈ గ్రంథాన్ని విశేషంగా ఆదరించారు.

   సి) శ్రీ గాయత్రీ పీఠాధిపతులు తత్త్వ ప్రతిపాదక గ్రంథములలో ఇది మొదటిది అన్నారు.

10. **గ్రంథంలోని ప్రకరణాలు** – ఇవి ఆరు.

   1. వైరాగ్య ప్రకరణము (1,500 శ్లోకాలు)
   2. ముముక్షు వ్యవహార ప్రకరణము (1,000 శ్లోకాలు)
   3. ఉత్పత్తి ప్రకరణము (7,000 శ్లోకాలు)
   4. స్థితి ప్రకరణము (3,000 శ్లోకాలు)
   5. ఉపశమ ప్రకరణము (5,000 శ్లోకాలు)
   6. నిర్వాణ ప్రకరణము (పూర్వార్థము,ఉత్తరార్థము) (14,500 శ్లోకాలు)

వైరాగ్య ప్రకరణంలో శ్రీరాముడికి కలిగిన వైరాగ్య ప్రకారాన్ని వివరంగా వర్ణించారు.

రెండవదైన ముముక్షు వ్యవహార ప్రకరణంలో –ముముక్షువుకు వుండవలసిన సాధనా సంపత్తిని గూర్చి విస్తారంగా చర్చించారు. దీనిలోనే మోక్షం కోసమై పురుష ప్రయత్నం చేయ్యాలా? అక్కర్లేదా అని విచారణ చేసి, పురుషప్రయత్నం చెయ్యాలి – అని సిద్ధాంతం చేశారు.

ఉత్పత్తి ప్రకరణంలో – కనిపించే ఈ ప్రపంచానికి ఉత్పత్తి వున్నదా? లేదా? అనే విచారణ చేశారు.

స్థితి ప్రకరణంలో జగత్తుయొక్క స్థితిని వివరించారు.

ఉపశమ ప్రకరణంలో జ్ఞానం ద్వారా అంతఃకరణోపశమనం కలిగించే విధానాలను వివరించారు.

చిట్ట చివరిది, నిర్వాణ ప్రకరణం. ఇది చాలా పెద్దది. దీనిని రెండు భాగాలుగా విభజించారు. నిర్వాణం అంటే మోక్షం. మోక్ష ప్రాప్తిని గూర్చి దీనిలో కూలంకషంగా చర్చించారు.

11. వ్యాఖ్యానాలు – దీనికి సంస్కృతంలో అనేక వ్యాఖ్యానాలు ఉన్నాయని ప్రసిద్ధి ఉన్నప్పటికీ, ఆనందబోధేంద్ర సరస్వతీ యతి రచించిన తాత్పర్య ప్రకాశికా వ్యాఖ్యానం మాత్రమే ముద్రితమై లభిస్తోంది. దీనిని 1937లో నిర్ణయ సాగర్ ప్రెస్‌వారు ముద్రించారు. ఈ వ్యాఖ్యానం బహు విపులమై పండిత ప్రశంసలు అందుకొంది.

ఈ వాల్మీకి ఎవరు?:

యోగవాశిష్ఠ రచయిత అయిన వాల్మీకీ, సుప్రసిద్ధ రామాయణ రచయిత అయిన వాల్మీకీ, ఒకరు కాదని కొందరు ఉత్సాహంగా వాదిస్తున్నారు. అలా వాదించే వారిలో రెండు రకాలవారున్నారు.

అద్వైత సిద్ధాంతాన్ని అతి స్పష్టంగా ప్రతిపాదించే ప్రాచీనతర గ్రంథాలలో యీ యోగవాశిష్ఠం చాలా ప్రబలమైనది. అందువల్ల అద్వైత సిద్ధాంత వ్యతిరేకులు కొందరు దీని ప్రామాణ్య బలాన్ని తగ్గించేందుకోసం ఇది వాల్మీకి రచన కాదని ఆరాటంతో పోరాటానికి దిగుతూ వుంటారు. వీరు ఒక రకం.

ఇక రెండవ రకంవారు – "ఆధునిక విమర్శ దృష్టితో గ్రంథాలను పరిశీలించాలే గానీ, సాంప్రదాయక దృష్టితో కాదు"– అని భావించేవారు. మొదటి రకం వారుగూడా, అటుతిరిగి, ఇటుతిరిగి, యీ రెండవ రకం వారి అండకే చేరుతూ వుంటారు కనుక, వీరి వాదన యేమిటో కొంచెం పరిశీలిద్దాం. ఈ వాదనలో ముఖ్యమైన అంశాలు రెండే.

శైలి విషయంలో మామూలు రామాయణానికీ, యోగవాశిష్ఠానికీ, పెద్ద భేదాన్ని ఎవరూ ఆపాదించలేరు. విమర్శకులెవరూ ఆ విషయంలో పెద్దగా వాదాలు చెయ్యటం లేదు. కానీ, "ఈ యోగ వాశిష్టం గురించిన ప్రసక్తి అసలు రామాయణంలో నామ మాత్రంగా గూడా లేదు కదా! ఎందుకు లేదు?" –అని నవీన విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. దీనికి విపులమైన సమాధానం అసలు గ్రంథంలోనే వైరాగ్య ప్రకరణ ప్రారంభంలోనే వుంది. దయచేసి పరిశీలించండి.

ఇక రెండవ ముఖ్యాంశం! "ఈ గ్రంథంలో అనేకచోట్ల వ్యాసుడి ప్రసక్తి, శుకుడి ప్రసక్తి, భగవద్గీత, అర్జునుడు, కృష్ణుల, ప్రసక్తి, విస్పష్టంగా వున్నాయి కదా! వీటిని బట్టి యీ గ్రంథం భగవద్గీతానంతర రచన అని ఖాయం కావటం లేదా?" అని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇందులో వ్యాస శుకుల ప్రసక్తి గురించి, ప్రశ్న సమాధాన రూపమైన చర్చ మూలగ్రంథంలోనే వుంది. దీన్ని శ్రీరామ వశిష్ఠుల చర్చగా వాల్మీకి మహర్షి నిర్వహించాడు.

ఇక భగవద్గీత ప్రసక్తి గురించి ఆలోచించేముందు, ఒక ముఖ్య విషయాన్ని పాఠకుల దృష్టికి తీసుకు రావలసి వుంది.

ఇది భగవద్గీతానంతర రచన అని గదా, మనం ఆలోచిస్తున్నాం! అంటే, భగవద్గీతానంతర కాలంలో ఎవడో ఒక కవి వాల్మీకి శైలిని ఎంతో కొంత అభ్యాసం చేసి, ఆ శైలిలో అద్వైత ప్రతిపాదన చేసే గ్రంథాన్ని వ్రాసి, దానికి విలువ పెరిగేందుకోసం వాల్మీకి మహాకవి పేరున ఆ గ్రంథాన్ని ప్రచారంలోకి తెచ్చాడు – అని గదా మన ఆలోచన!

అలా తన గ్రంథానికి వాల్మీకి పేరు పెట్టిన కవి పేరు గూడా వాల్మీకే అయి వుండవచ్చు, కాకపోనూవచ్చు. పేరేదైనా, ఆయన వేదాంత శాస్త్రంలో గట్టి పండితుడు. చెయ్యి తిరిగిన మహాకవి, 32వేల శ్లోకాల గ్రంథాన్ని అందంగా పూర్వాపర విరోధం లేకుండా, నిర్వహించగల సమర్థుడు. యుక్తి యుక్తంగా విషయ ప్రతిపాదన చెయ్యగల తార్కికుడు! ఇలాంటి వ్యక్తి ఒక గ్రంథం రచించి, దాన్ని వాల్మీకి కృతంగా లోకానికి అందించాలని సంకల్పించాడు. అలాంటివాడు లోకులకు అనుమానం కలిగే ఘట్టాలను తన గ్రంథంలో చేరుస్తాడా? "ఆయనకు అంత ఆలోచన వచ్చి వుండదు" అనుకుందామంటే, ఆ వ్యక్తియొక్క సామర్థ్యం ఎటువంటిదో ఇపుడే చెప్పుకున్నాం కదా! అంతటి సమర్థుడు, తెలిసి తెలిసీ, ఇలాంటి లొసుగు పనులు చేస్తాడా? అది అసంభవం. కనుక భగవద్గీతానంతరం కవులలో ఎవడో ఒకడు ఇలాంటి పని చేశాడని ఊహించటం మన తెలివి తక్కువ తనమే అవుతుంది.

"ఐతే, రామాయణ వాల్మీకే యీ యోగవాశిష్ఠాన్ని రచించివుంటే, ఎప్పుడో ఒక యుగం తరువాత, ద్వాపరయుగాంతంలో రాబోయే భగవద్గీత ప్రసక్తిని యీ గ్రంథంలోకి ఎందుకు తెస్తాడు? ఎలా తెస్తాడు?" అంటారా?

వాల్మీకీ స్వభావం:

వాల్మీకి మహాకవి స్వభావంలోనే అలాంటి గుణం వుంది. ఎలాగంటారా? చూడండి.

పూర్వరామాయణంలో వాల్మీకి మహాకవి తన కావ్యావతరణ ఘట్టాన్ని స్పష్టంగా వర్ణించాడు. దైవయోగంగా ఆయన నోటి వెంట కవితాధార మొదలైంది. ఈ కవిత్వంతో ఏం చేయాలా అని ఆలోచిస్తూ ఉండగా, నారద మహర్షి వచ్చి అప్పటికి రాజ్యపాలన చేస్తూ వున్న శ్రీరామచంద్ర ప్రభువును గురించి పరిచయం చేసి, "ఇక మిగిలిన కథా వివరాలన్నీ నీ దివ్య దృష్టితో నువ్వే దర్శించి, ఒక మహాకావ్యం రచించు" అని ప్రోత్సహించి వెళ్ళిపోయాడు. ఆ తరువాత బ్రహ్మదేవుడి ప్రోత్సాహం కూడా తోడైంది. దాంతో ఉద్దీపన పొందిన వాల్మీకి మహర్షి, తన దివ్య దృష్టితో రామకథలోని ప్రతి అంశాన్నీ

పరిశీలించి చూశాడు. ఆ వరుసలో వరుసగా, భవిష్యత్ ఘట్టాలను కూడా ఆయన దర్శించాడు. తను దర్శించింది దర్శించినట్లే కావ్యంగా వ్రాశాడు. అదే శ్రీమద్రామాయణ మహాకావ్యం.

అందుకే ఆ కావ్యంలోని మొట్టమొదటి సర్గలోనే, వాల్మీకి మహాకవి కొంతవరకూ భూతకాల క్రియా పదాలను ప్రయోగించి, ఆ పైన వర్తమానకాల క్రియా పదాలను, ఆ పైన భవిష్యత్ కాల క్రియా పదాలను, ప్రయోగించాడు. చూడండి.

నంది గ్రామే జటా హిత్వా భ్రాతృభిస్సహితోఽనఘః।

రామస్సీతా మనుప్రాప్య రాజ్యం పునరవాప్తవాన్ ॥

(బాలకాండ 1వ సర్గ 89వ శ్లోకము)

(తా॥ రాముడు తమ్ములతో గూడిన వాడై, నందిగ్రామ మందు జడలను విడిచి, సీతను చెంతకు తీసికొని, మరల రాజ్యమును పొందెను.)

దీనిలో "అవాప్తవాన్" (= పొందెను) అనే భూతకాల క్రియ వుంది.

న చాగ్నిజం భయం కించి న్నాప్సు మజ్జన్తి జన్తవః

(బాలకాండ 1వ సర్గ 92వ శ్లోకము)

(తా॥రాముడు రాజ్యం చేస్తూ వుండగా ప్రజలకు అగ్ని భయం లేదు. ఎవరూ నీళ్ళల్లో మునిగి మరణించటం లేదు.) ఇక్కడ "న మజ్జన్తి" (= మునగటం లేదు) అని వర్తమాన కాల క్రియా పదం వుంది.

రాజవంశాన్ శతగుణాన్ స్థాపయిష్యతి రాఘవః।

(బాలకాండ 1వ సర్గ 96వ శ్లోకము)

(తా॥ శ్రీరాముడు వందలకొలదీ రాజవంశాలను స్థాపించగలడు.) ఇక్కడ "స్థాపయిష్యతి" (= స్థాపించగలడు.) అని భవిష్యత్ కాల క్రియా పదం వుంది.

ఇలా తన దివ్య దృష్టితో చూసిన ప్రకారంగా, భూతకాల కథను భూతకాలంగానూ, వర్తమానకాల కథను వర్తమాన కాలంగానూ, భవిష్యత్కాల కథను భవిష్యత్ కాలంగానూ, యథాతథంగా ప్రతిపాదించే అలవాటు వాల్మీకి మహర్షికి స్వతస్సిద్ధంగానే వుందనే విషయం పూర్వ రామాయణంలోనే మనకు తెలుస్తోంది.

రామాయణంలోనే ఉత్తర కాండలో మరో ఘట్టం వుంది. సీతాదేవి భూప్రవేశం చేసినాక, శ్రీరాముడు దుః ఖంతోనూ, క్రోధంతోనూ, ఉడికిపోగా, బ్రహ్మదేవుడు స్వయంగా ప్రత్యక్షమై, ఆయన్ని ఓదారుస్తూ ఇలా అన్నాడు–

ఏతదేవ హి కావ్యం తే కావ్యానా ముత్తమం శ్రుతమ్।

..

భవిష్యదుత్తరం చైవ సర్వం వాల్మీకినా కృతమ్।

..

శేషం భవిష్యం కాకుత్స్థ కావ్యం రామాయణం శ్రుణు।

..

న ఖల్వన్యేన కాకుత్స్థ శ్రోతవ్యమిదముత్తమమ్॥

(బాలకాండ 98వ సర్గ, 16నుంచి 22దాకా శ్లోకాలు)

(తా॥ రామా! నీ గురించి రాసిన ఈ కావ్యాన్ని నువ్వు విన్నావు. ఇది చాలా గొప్పది. దీనిలో వాల్మీకి భవిష్యత్ కథ కూడా చెప్పాడు. ఆ భాగాన్ని పూర్వమే నేను విన్నాను. రామా! నువ్వు ఇప్పుడు ఆ రామాయణంలో మిగిలిన భవిష్యత్ భాగాన్ని విను. ఇది నువ్వు తప్ప ఇతరులు వినరాదు.)

బ్రహ్మదేవుడు ఇలా ఆజ్ఞాపించగా , శ్రీరాముడు కొద్దిమంది బ్రహ్మర్షులతో కలిసి, తన భవిష్యత్ కథను విన్నాడు – అని అక్కడ వుంది. ఈ ఘట్టం కూడా వాల్మీకియొక్క భవిష్యత్ కథారచన శీలాన్ని వ్యక్తం చేస్తోంది.

వాల్మీకి మహర్షి మహాకవికి ఇలాంటి స్వభావం వుంది కనుకనే, యోగవాశిష్ఠంలో కూడా కొన్ని సందర్భాలలో అతి ప్రాచీన పూర్వగాథలను, మరికొన్ని సందర్భాలలో సుదూర భవిష్యత్ కథలను కూడా, ఆయన పొందుపరచటం జరిగింది. అలాంటి సన్నివేశాలు వచ్చినప్పుడు పఠితలకు సందేహాలు వస్తాయని ఆయనకు ముందే తెలుసు. అందుకే, ఆయా సందర్భాలలో శ్రీరాముడిచేతనే ప్రశ్నింప చేసి, ఇది ఎప్పటి కథో , ఇది ఇక్కడ ఎలా అతుకుతుందో తనే వివరించాడు.

వ్యాసమహర్షి ఘట్టం వచ్చినప్పుడు అలాగే చేశాడు. భగవద్గీతాఘట్టం వచ్చినప్పుడు కూడా ఆ కవి దాన్ని అలాగే వివరించాడు. ఆ ఘట్టం నిర్వాణ ప్రకారణంలో రాబోతోంది.

ఇలా భవిష్యత్ ఘట్టాలను, సుదూర భూతకాల ఘట్టాలను, ప్రస్తావించే పద్ధతి మహర్షులైన ఇతర కవుల రచనలలో కూడా కనిపిస్తూనే వుంటుంది. ఋషుల రచనాశైలితో బాగా పరిచయం వున్నవారికి ఇది కొత్తగా వుండదు. అగస్త్య సంహితలో పుట్టబోయే రాముణ్ణి గురించి అగస్త్యమహర్షి సుతీక్షణమహర్షికి వివరించాడు. ఈ విషయం ఈ గ్రంథంలోనే వైరాగ్య ప్రకరణంలోనే ప్రస్తావనకు వచ్చింది. వ్యాస భగవానుడి రచనలలో భవిష్య పురాణమని ప్రత్యేకంగా ఒక పురాణమే వుంది.

లోకంలో ఈనాడు మనకు తెలిసివున్న కవులంతా సాంసారిక కవులే. ఆర్ష వాఙ్మయాన్ని బాగా వంటపట్టిచ్చుకోవటం ద్వారా, వారిలో ఋషిత్వ రేఖ తాత్కాలికంగా ప్రవేశించి, మహాకావ్యాలు ఉద్భవిస్తూ వుంటాయి. వాల్మీకి వ్యాసాదులు స్వతస్సిద్ధంగా మహర్షులు. కవిత్వం వారిని తాత్కాలికంగా ఆవేశించగా, వారిలోంచీ విశ్వజనీన, విశ్వకాలీన, మహా కావ్యాలు ఆవిష్కృతములవుతూ వుంటాయి! మామూలు కవులను కొలిచే కొలబద్ధలతో ఋషి కవులను కొలవాలనుకోవటం, మూరలతో హిమాలయాన్ని కొలవాలనుకోవటమే కాగలదు.

కనుక ఈ విధమైన, ఆర్షశైలీ పరిచయ సంపన్నమైన, విమర్శన దృష్టితో పరిశీలించి చూసినప్పుడు, ఈ యోగవాశిష్ఠం రామాయణ కర్తయైన వాల్మీకి రచించినదే అనటంలో సందేహించవలసిన పని వుండదు. ఆర్షశైలితో పరిచయం వుండి కూడా, అద్వైత సిద్ధాంతం మీద వ్యతిరేకతతో దీన్ని అవాల్మీకి కృతంగా నిరూపించాలనే పట్టుదలతో వున్నవారికి మౌనంగా నమస్కరించటమే ఉత్తమం.

హృదయము: ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే, ఈ గ్రంథ రచయిత వాల్మీకి. ఈయన మహాకవి. అంతకుమించి మహర్షి. ఋషి అంటే తత్త్వాన్ని దర్శించేవాడు. కవి అంటే కాంతా సంమితంగా పలికేవాడు. ఈ రెండు లక్షణాలూ వాల్మీకిలో కలిసి వున్నాయి. కనుకనే, పైకి మామూలుగా కనిపిస్తూనే లోపల అంతులేని రత్నాలను దాచి వుంచగల వాక్యశైలి ఆయనకు వంటబట్టింది. రామాయణంలో అడుగడుగునా ఆ లక్షణం వుంది. గోవిందరాజ వ్యాఖ్యానమే లేకపోతే, ఇక్కడ శ్లేష వుంది. ఇక్కడ అర్థాంతరం వుంది, అని మనం కలలో కూడా ఊహించం. ఆ మహాకవే ఈ యోగవాశిష్ఠాన్ని రచించాడు. కనుక, ఇక్కడ గూడా ఆ లక్షణమే వుంటుంది. ఆ నిగూఢ కవి హృదయాన్ని పట్టుకుంటేనే ఆయన దర్శించిన తత్త్వాన్ని మనం అందుకోగలుగుతాం.

ఈ దృష్టితోనే ఈ గ్రంథాన్ని, దీని వ్యాఖ్యానాన్నీ కూడా, నేను అధ్యయనం చేశాను. పెద్దలనడిగాను. గురుదేవులను ప్రార్థించాను. పూర్వాశ్రమంలో మాకు పితృపాదులు, ప్రస్తుతాశ్రమంలో బ్రహ్మవిద్యా గురుదేవులు అయిన ప్రాతస్స్మరణీయులు శ్రీశ్రీశ్రీ **జనార్ధనానంద సరస్వతీ యతీంద్రుల** బోధలను అనుసంధానం చేసుకొన్నాను. నేను గ్రహించగలిగినది జెమిని టెలివిజన్ వారి ప్రాతఃకాల ప్రవచనాల్లో ప్రజలకు విన్నవించాను. దానినే ఇప్పుడు ఈ గ్రంథంగా మీ ముందు వుంచుతున్నాను. అందుకే దీని పేరు "యోగవాశిష్ఠ హృదయము."

వాశిష్ఠమా? వాసిష్ఠమా? : ఈ గ్రంథంలో వశిష్ఠ, వాశిష్ఠ పదాలు వచ్చినప్పుడు నేను "మెలిక శ"ని (శివలోని "శి"ని) వాడాను. కొందరు గ్రంథకర్తలిక్కడ దంత్య "స కారం" (సీతలోని సకారం) వాడారు. రెండూ ఒప్పే, రెండూ ఒకటే. శబ్ద కల్పద్రుమంలో ఈ రెండు శబ్దాల వ్యుత్పత్తినీ విస్పష్టంగా ప్రదర్శించారు. అక్కడ ఇలా వుంది –

వశవతాం - వశినాం శ్రేష్ఠః ఇత్యర్థే ఇష్ఠన్‌ప్రత్యయః - విన్మతోర్లుక్ ఇతి లుక్ -

వశిష్ఠః - పృషోదరాదిత్వాత్ శస్య సః వసిష్ఠః– అని.

ఆ శబ్ద కల్పద్రుమంలోనే, మహాభారత శ్లోకం వొకటి ఉదహరించారు–

వశిష్ఠోస్మి వరిష్ఠోస్మి వశే వాసగృహేష్వపి ।

వశిష్ఠత్వాచ్చ వాసాచ్చ వసిష్ఠ ఇతి విద్ధి మామ్॥

ఇది 13వ పర్వ– 63వ అధ్యాయం – 96వ శ్లోకం –అని అక్కడే చెప్పారు. ఇంద్రియనిగ్రహం గలవాళ్లలో శ్రేష్ఠుడు గనుక వశిష్ఠుడనీ, గృహస్థులలో శ్రేష్ఠుడు గనుక వసిష్ఠుడనీ, రెండూ నా పేర్లే – అని ఈ శ్లోకంలో వశిష్ఠుడే స్వయంగా చెపుతున్నాడు. కనుక ఆ రెండు పేర్లల్లో దేన్ని వాడుకున్నా తప్పులేదు. వేదాంత విద్యలో ఇంద్రియ జయం ప్రధానం కదా అని, నేను వశిష్ఠ పదాన్ని (మెలిక శ వున్న పదాన్ని) ఎక్కువగా అభిమానించాను.

విషయ ప్రతిపాదనలో, సర్గల సంపుటీకరణంలో, ఆధునిక విజ్ఞాన సమన్వయంలో, కొన్ని కొత్త దారులు తొక్కాలని ప్రయత్నించాను. ఈ విషయంలో నేనెంతవరకు కృతకృత్యుడినో విజ్ఞులైన పఠితలే నిర్ణయించాలి. ఎక్కడైనా దోషాలు కనిపిస్తే దయచేసి తెలుపండి. ఉత్తరోత్తరా వాటిని సవరించుకుంటాను. అయితే, ఈ గ్రంథాన్ని మూల గ్రంథానికి అనువాదంగా గానీ, సంగ్రహీకరణంగా గానీ, దయచేసి దర్శించకండి. కవి హృదయాన్ని అందుకునే ప్రయత్నంగా మాత్రమే దర్శించండి–అని మరోసారి మనవి చేస్తున్నాను. ఇప్పుడు ఈ గ్రంథంలోని వైరాగ్య ప్రకరణం ప్రథమభాగంగా మీ చేతిలో వుంది.

నేనూ ఈ ప్రవచనాలకు ఒక శ్రోతనే! ఈ సంకలనానికి పఠితనే!! లోపల వుండి పలికేవాడూ, కలంలో దూరి గిలికేవాడూ, ఎవడో ఉన్నాడు!!! వాడి కరుణను ఆత్మానుభూతిగా మాకందరికీ పంచమని గురుదేవులు శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీవారిని వేడుకొంటున్నాను.

జయగురుదత్త

ఇట్లు

బుధజన విధేయుడు

కుప్పా వేంకట కృష్ణమూర్తి

తేది. 18.11.2015

హైదరాబాదు

+91 40–24035013,

E-mail: vedakavi@serveveda.org,

web: www.serveveda.org